క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట


శ్రీధరఘట్టలో వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించిన దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధర ఘట్ట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం గ్రామ మధ్యలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు జ్యోతులు మోసుకొని ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి మహర్షికి సమర్పించారు. ఈ మహోత్సవానికి మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి వాల్మీకులు పెద్ద ఎత్తున వచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి


ముద్దినాయనపల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని ముద్దినాయనపల్లి గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ×సంసిద్ధత× అనే కార్యక్రమం నిర్వహించారు. 15 మంది చిన్నారులు ఒకటో తరగతికి ప్రమోట్ అవుతున్నందున గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పలు విద్యార్థులకు అక్షరభాసం, అన్నప్రాసన, సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు హెల్త్ క్యాంపు


ఉరవకొండలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికుల కోసం ఈఓ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈఓ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాంపులో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ వినీత కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించుకుంటాం


చలో విజయవాడ పోస్టర్లు విడుదల చేస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి అయినా కౌలు రైతుల సమస్యలు పరిష్కరించుకుంటామని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ ఆలయ ప్రాంగణంలో చలో విజయవాడ పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సంఘం నాయకులు పెద్దముష్టూరు వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 11న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క కౌలు రైతూ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుంకన్న, ఆంజనేయులు, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

బెళుగుప్ప తహసీల్దార్‌గా అనిల్‌కుమార్



బెళుగుప్ప:మండల నూతన తహసీల్దార్‌గా బి.అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ షర్మిళ కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. డీ.హిరేహాళ్ తహసీల్దార్ బి.అనిల్‌కుమార్ బెళుగుప్ప తహసీల్దార్‌గా నియమితులయ్యారు. తహసీల్దార్‌కు కార్యాలయ డీటీ సురేఖ, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సర్వేయర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.



పిల్లలపల్లి సమీపంలో కూలీలతో ఆర్డీటీ సేవలను అడుగుతూ వారు అందించిన భోజనాన్ని తింటున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య , కన్నేపల్లిలో సేవ్ ఆర్డీటీ పాదయాత్ర

ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు బ్రహ్మరథం

- అన్ని వర్గాల నుంచి లభిస్తున్న మద్దతు
- ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించే వరకూ పాదయాత్ర
- మాజీ ఎంపీ తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం: కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు అన్ని వర్గాలవారూ బ్రహ్మరథం పడుతున్నారు. రంగయ్య చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మూడోరోజు బ్రహ్మసముద్రం మండలంలో సాగింది. శుక్రవారం ఉదయం బొమ్మగానిపల్లి గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర రాయలదొడ్డి, కన్నేపల్లి, ముద్దలాపురం, పిల్లలపల్లి, గొంచిరెడ్డి పల్లి, సూగేపల్లి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వరనాయుడు బృందానికి ఆయా గ్రామాల ప్రజలు, ఆర్డీటీ లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారు. గ్రామ గ్రామానా పేదలు, అన్నివర్గాల వారూ ఆర్డీటీ ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. అదే


ముద్దలాపురం సమీపంలో టీ తాగుతూ రోడ్డు పక్కన సేద తీరుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేతలు ఉమా, తిప్పేస్వామి

విధంగా తలారి రంగయ్య పాదయాత్ర బృందానికి పూల చల్లుతూ డప్పుల వాయిద్యాలతో దారి పొడవునా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలలో మాజీ ఎంపీ రంగయ్య ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్డీటీని పరిరక్షించేందుకే పాదయాత్ర..

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుండా కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని రంగయ్య విమర్శించారు. తాను రాజకీయాల కోసం పాదయాత్ర చేయలేదని, కేవలం ఆర్డీటీని కాపాడుకునేందుకు తపిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీటీ లేకపోతే వెనుకబడిన జిల్లాలోని దళిత, గిరిజన మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, రైతులతోపాటు


పిల్లలపల్లి వద్ద తాము సైతం ఆర్డీటీ కోసం అంటూ పాదయాత్రకు మద్దతిచ్చిన చిన్నారులు

అన్ని వర్గాల వారూ కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్దరించే వరకు తన పాదయాత్ర ఆగదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధర, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న గౌడ్, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, వివిధ అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, గోపాల్ రెడ్డి, మహేశ్‌స్వామి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్, తాలూకా వాణిజ్య విభాగం పాత లింగప్ప, తాలూకా కార్మిక సంఘం అధ్యక్షులు సంజీవయ్య, రైతు సంఘం అధ్యక్షులు అభిలాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు చెలిమేపల్లి ఆంజనేయులు, అశోక్ రెడ్డి, తాలూకా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి, తాలూకా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు సునీత, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, సుదీర్, ఎంఎస్ రాయుడు, హనుమంతరాయుడు, జీహెచ్ రాయుడు, ఎంపీపీలు నాగరాజు, ఆంజనేయులు, భీమేష్, సర్పంచులు శంకరప్ప, ఆదినారాయణరెడ్డి, రామ్మోహన్, మల్లేశు, ఎంపీటీసీ సభ్యులు తిప్పేస్వామి, బుళప్ప, నరసింహులు, దొడగట్ట మురళి, రామాంజినేయులు, మల్లికార్జున, ప్రతాప్, పరంధామరెడ్డి, నారాయణస్వామి, వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శెట్టూరు మండలానికి చేరనున్న పాదయాత్ర

శెట్టూరు: ఆర్డీటీ పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్ర శనివారం శెట్టూరు మండలంలోకి ప్రవేశించనుంది. మండలంలోని యాటకల్లు గ్రామంలో ప్రవేశించి, అక్కడ నుంచి మంగంపల్లి, చిన్నంపల్లి, బచ్చేహళ్లి (రాత్రి బస), కైరేవు, చెర్లోపల్లి, లక్ష్మంపల్లి (రాత్రి బస) కంబాలపల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర సాగనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి తెలిపారు. మండల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, తలారి రంగయ్యతో కలిసి పాదయాత్రకు పెద్ద ఎత్తున కలిసి రావాలని కోరారు.

బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్టలో భాగస్వాములు కావాలి


బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట పోస్టర్లను విడుదల చేస్తున్న వీరశైవ సంఘం నాయకులు

ఉరవకొండ: విడపనకల్లు మండలం ఉండబండలో నూతన బసవేశ్వరుడి విగ్రహ ప్రతిష్టలో పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఉరవకొండ నియోజకవర్గ వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక గవిమఠం ఆవరణలో గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా బసవేశ్వరుని విగ్రహ ప్రతిష్ట కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా వీరశైవ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈనెల 7న ఉరవకొండ గవిమఠం నుంచి బసవేశ్వరుడి విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా ఉండబండకు తరలిస్తామన్నారు. అనంతరం 8న బసవేశ్వరుని విగ్రహ ప్రతిష్ట ఉంటుందన్నారు. విగ్రహ ప్రతిష్టకు గవిమఠం ఉత్తరాధికారితోపాటు పాల్తూరు స్వామిజీలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు బండిగౌడ, వీరభద్రగౌడ, భరత్‌కుమార్, వినోద్‌కుమార్, మహేంద్ర, వీరభద్ర, పాటిల్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్డీటీపై ఆంక్షలు వెంటనే ఎత్తి వేయాలి


వజ్రకరూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు వెంటనే ఎత్తేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో ఆర్డీటీ పరిరక్షణ సమితి, ఎమ్మార్పీఎస్ నాయకులు, బంజారా సంఘం నాయకులు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సేవ్ ఆర్డీటి, గరీబ్‌హ టావో-ఆర్డీటీ బజావో అన్న నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఈనెల 19న ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా ఉరవకొండలో సేవ్ ఆర్డీటీ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ నరేషకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం జాతీయ గౌరవాధ్యక్షుడు కేశవ నాయక్, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, ఎం ఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బెంజిమెన్, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక జిల్లా నాయకుడు ఆనందరాజు, మాజీ జెడ్పీటీసీ తులసీదాస్‌నాయక్, బంజారా నాయకుడు సుబ్రమణ్యం నాయక్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు మల్లికార్జున,భవన నిర్మాణకార్మిక సంఘం నాయకులు నాగేంద్ర, బొజ్జన్న, సుంకన్న, సీడీసీ సభ్యుడు వాల్యానాయక్, ప్రజాసంఘాల నాయకులు రామాంజనేయులు, లాలునాయక్, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిపై కుమారుడు దాడి

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలో ఆస్తి కోసం తల్లిపై కుమారుడు దాడి చేసిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలు.. ఆస్తి ఇవ్వలేదని చాబాల గ్రామానికి చెందిన శైలజా అనే మహిళపై కుమారుడు నరేష్ దాడి చేసి, ఇంటి నుంచి బయటకు గెంటి వేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వజ్రకరూరు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాలను అడ్డుకుందాం


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాబోధకుడు

రాయదుర్గంటౌన్: బాల్య వివాహాలను అడ్డుకుందామని ఆరోగ్య విద్యాబోధకుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కదిరంపల్లి గ్రామంలో బేటీ బచావో..బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులపై బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం శిక్ష ఉంటుందన్నారు. ఎవరైనా ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే 1098కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రామాంజనేయులు, ఆరోగ్య కార్యకర్త సుజాత, కొల్లమ్మ పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను గౌరవించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

గుమ్మఘట్ట: గ్రామాల్లో సభలు,సమావేశాలు నిర్వహించినప్పుడు షామియానాలు, కుర్చీలు, భోజనాల వసతులు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు గుర్తుకు వస్తారా ? మిగితా విషయాలలో గుర్తుకు రారా? అని పలువురు సర్పంచులు అధికారులను నిలదీశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవాని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కె.పి.దొడ్డి సర్పంచ్ మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. పార్టీలకతీతంగా అధికారులు పని చేయాలని,పనితీరు మార్చుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, జయమ్మ, డీటీ విజయలక్ష్మీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కొరఢా


అపరాధ రుసం విధిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయదుర్గంటౌన్: సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విక్రయాలపై మున్సిపల్ అధికారులు కొరఢా ఝులిపించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ప్లాస్టిక్ విక్రయాలపై చర్యలు చేపట్టారు. పాత బస్టాండ్ ఏరియా, వినాయక సర్కిల్ ఏరియాలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. 10 దుకాణాల నుంచి 82 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.15 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు.

హెచ్చెల్సీ మరమ్మతు పనులు వేగవంతం చేయండి


హెచ్చెల్సీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్/ కణేకల్లు: హెచ్చెల్సీ మరమ్మతు పనులు వేగవంతంగా చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో నాగలాపురం, మల్లికేతి, నాగేపల్లి, కణేకల్లు చెరువు వద్ద అవుట్‌ఫా రెగ్యులేటర్ వద్ద జరుగుతున్న హెచ్చెల్సీ బ్రిడ్జి, లైనింగ్ పనులను హెచ్చెల్సీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా గండ్లు పడుతున్నాయని, అత్యవసరంగా చేయాల్సిన పనులకు రూ. 35 కోట్లు మంజూరు అయ్యిందన్నారు. రూ.27 కోట్లతో చేసే పనులు తుంగభద్ర ప్రధాన కాలువపై జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి, జేఈ అల్తాఫ్, తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, కొత్తపల్లి తిమ్మరాజు , యర్రగుంట్ల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం అగచాట్లు


కణేకల్లులో ఆధార్ అప్‌డేట్ కోసం క్యూలో ఉంచిన క్యారీ, బ్యాగులు

కణేకల్లు: కణేకల్లులో ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తోంది. కణేకల్లు మండలంలో ఆధార్ అప్డేట్ వర్క్‌పై శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. కణేకల్లు–2 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉమేష్, గరుడచేడు సచివాలయ అసిస్టెంట్ నరేష్‌లు... ఆధార్ అప్డేట్‌పై శిక్షణ పొంది అప్డేట్‌కు అవసరమైన కిట్స్ (వేలిముద్రల స్కానర్, ఐరిస్ స్కానర్) తీసుకొన్నారు. అధికారులు కణేకల్లు–2 డిజిటల్ అసిస్టెంట్ ఉమేష్‌కు మాత్రమే ఆధార్ అప్‌డేట్ వర్క్ ఇచ్చారు. మండలంలోని 30 గ్రామాల ప్రజలు ఆధార్ అప్డేట్ కోసం కణేకల్లు–2 సచివాలయానికి క్యూ కడుతున్నారు. ఆధార్ అప్డేట్ కోసం రోజు 60 మందికి పైగా ప్రజలు వస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ కొనసాగించాల్సి ఉండగా, రేషన్‌కార్డు సర్వే, ఈకేవైసీ, 1బీ ఎంట్రీ ఇతర పనులతో ఒక్కోరోజు 2 గంటలకే ఆధార్ కేంద్రాన్ని క్లోజ్ చేస్తున్నారు. దీంతో ఉదయం నుంచి ఆధార్ అప్డేట్ కోసం నిరీక్షిస్తున్న ప్రజలు తమ విలువైన సమయం వృథా అవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతు కుటుంబానికి చేయూత


హనుమంతరెడ్డి భార్య సువర్ణకు నగదు అందిస్తున్న మిత్ర బృందం

బెళుగుప్ప: మండల కేంద్రానికి చెందిన రైతు హనుమంతరెడ్డి కుటుంబానికి మిత్రులు చేయూతనందించారు. రైతు హనుమంతరెడ్డి ఏప్రిల్ 3న పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బెళుగుప్ప ఉన్నత పాఠశాల పదోతరగతి 1995–96 బ్యాచ్ విద్యార్థులు కలిసి రూ.22వేలు నగదు స్నేహితుడి భార్య సువర్ణకు శుక్రవారం అందించారు. మిత్రుడి కుటుంబానికి ఫ్రెండ్స్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ హెల్పి ంగ్ హాండ్స్ తరపున నగదు అందించామని మిత్రులు తిమ్మారెడ్డి, గంగాదర్‌రెడ్డి, బాలాజీ, శివయ్య, హరి, ప్ర కాశ్, తిప్పేస్వామి, శైలజ, ఉమామహేశ్వరి తెలిపారు.

అనుమతి లేకుండా వాహనాలు నడిపితే సీజ్


ఆర్టీసీ డిపో వద్ద వైట్ బోర్డు వాహనదారులను హెచ్చరిస్తున్న ఆర్‌టీఓ, డీఎంలు

ఉరవకొండ: అనుమతి లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని గుంతకల్లు ఆర్‌టీఓ రాజాబాబు హెచ్చరించారు. శుక్రవారం ఉరవకొండలో ఏడాది కాలంగా 20 వైట్‌బోర్డు ఎర్టికా వాహనాల్లో ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికులను తరలిస్తున్న విషయం తెలుసుకున్న ఆర్‌టీఓ, ఉరవకొండ డిపో మేనేజర్ హంపన్నతో కలిసి తనిఖీలు చేశారు. ఆర్‌టీఓ మాట్లాడుతూ అనుమతులు లేకుండా రూట్లలో వాహనాలు నడపరాదని, మరోసారి ఇలా వాహనాలు నడిపితే జరిమానాతోపాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఉరవకొండ డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టే విధంగా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, శ్రీసాయి మోటార్ వెహికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కొల్లాపురి మహాలక్ష్మి రథోత్సవం


కొల్లాపురి మహాలక్ష్మి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురంలో వెలసిన కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉదయం గంగా జలం తెచ్చి మహాలక్ష్మి అమ్మవారిని అభిషేకించి, పూజలు చేశారు. 101 మంది గొరవయ్యలు సందడి చేశారు. మహిళా వీరకాశి నృత్యాలతో కొల్లాపురి మహాలక్ష్మి రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవం కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకుండా రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


అలంకరణలో కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారు

బక్రీద్ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి


మెట్టు గోవిందరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త

రాయదుర్గంటౌన్: త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ రాయ దుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలియజేశారు. శనివారం బక్రీద్ పండుగ జరుపుకోనున్న ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం, అతని కుమారుడు ఇస్మాయిల్ త్యాగనిరతిని స్మరించుకుంటూ నిర్వహించే ఈ పండుగ ముస్లింలు అందరికీ అల్లా మంచి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు


తలారి రంగయ్య, మాజీ ఎంపీ

కళ్యాణదుర్గం: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎంపీ, పీఏసీ సభ్యులు, సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన తన పాదయాత్రలో కలిసిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు అల్లా సూచించిన సన్మార్గంలో నడవాలన్నారు.

త్యాగనిరతి, దానధర్మాలకు ప్రతీక బక్రీద్


మాజీ ఎమ్మెల్యే విశ్వ, యువనేత ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: త్యాగ నిరతి, దాన ధర్మాలకు ప్రతీక బక్రీద్ అని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పండుగను ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాలన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

గుమ్మఘట్ట: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలియజేశారు. మండలంలోని నేత్రపల్లి, గుమ్మఘట్ట గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ ముస్లింలు సామూహికంగా ఈద్గాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసుకోవాలని తెలియజేశారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నిర్ణీత వేళకు ఈద్ నమాజ్‌కు హాజరుకావాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో ఈనెల 7న ఈదుల్ అజ్హ (బక్రీద్) పండుగ జరుపుకోనున్నట్లు ప్రభుత్వ ఖాజీలు కె.మహమ్మద్ సైఫుల్లా, అతావుర్ రహిమాన్ తెలిపారు. నిర్ణీత వేళకన్నా అరగంట ముందుగానే ముస్లింలు ఈద్గాలకు చేరుకుని నమాజ్ ఆచరించాలని సూచించారు. కచ్చితంగా నిర్ణీత వేళకు నమాజ్ ప్రారంభమవుతుందనే విషయాన్ని గుర్తించి వేళకు చేరుకోవాలని వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు. పట్టణంలోని సున్ని దర్గా మసీద్‌లో శనివారం ఉదయం 7:30 గంటలకు ఈద్ నమాజ్ జరుగుతుందని మసీదు కమిటీ సభ్యులు తెలిపారు.

ఈద్గా మైదానం	నమాజ్ వేళలు(శనివారం)
బళ్లారి రోడ్డు	ఉదయం 8 గంటలకు
కణేకల్లు రోడ్డు	ఉదయం 7 గంటలకు
బీటీపీ బైపాస్ రోడ్డు	ఉదయం 7:15 గంటలకు
దర్గా మసీద్	ఉదయం 7:30 గంటలకు

పరామర్శ


మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఉమా

కళ్యాణదుర్గం రూరల్: కొత్తూరుకు చెందిన శ్రీహరి అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతని అవయవాలను దానం చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు శుక్రవారం కొత్తూరులో పర్యటించి, శ్రీహరి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ భర్త బాబు, నాయకులు నరసింహులు, వీరేష్, పో ల ప్ప, నరేష్, రామకృష్ణ, గంగప్ప, ఈరన్న, అనిల్ పాల్గొన్నారు.